మంగళవారం 19-3-2024

# ముందడుగు దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 279, పేజీలు: 4 | ₹6

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

EPAPER.MUNDADUGU.COM

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం

మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp: 9491114616

email: mundadugu111@gmail.com



## గెలుపు గుర్రాలపై కాంగ్రెస్ కసరత్తు

దేశంలో సార్వత్రిక ఎన్నికల నగారా మోగిన వేళ.. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పట్టును నిలుపుకోవడానికి అవసరమైన కసరత్తు సాగిస్తోంది. ఇందులో భాగంగా చేరికలకు గేట్లు ఎత్తేసింది. ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ నుంచి పెద్ద ఎత్తున నాయకులను ఆకర్షించడం మొదలుపెట్టింది.


మిగతా 2లో




## అన్నాడీఎంకే పార్టీకి రూ.6.05కోట్ల విరాళాలు

దేశంలో ఎన్నికల బాండ్ల రూపంలో రాజకీయ పార్టీలకు అందిన విరాళాల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం బహిర్గతం చేసిన విషయం తెలిసిందే. వీటితో ఏ పార్టీకి ఎంత మొత్తం దక్కిందనే సమాచారం బయటికొచ్చింది. కొన్ని పార్టీలు ఈ బాండ్లతో తమకు ఎవరు విరాళం

మిగతా 2లో



## మీ ఓటు ఎక్కడుందో తెలుసుకోండి..

మన ఓటు హక్కు అసలు ఎక్కడ ఉందో, అసలు ఉందో, లేదో అందరూ ఆన్ లైన్ ద్వారా ఓటర్ల జాబితాలను చూసుకోవచ్చు. దీని కోసం మీరు సీఈఓ ఓటర్ లిస్ట్ అధికారిక వెబ్‌సైట్‌కి వెళ్లాలి. ఈ వెబ్‌సైట్‌ని సందర్శించడం ద్వారా, మీరు సిఈఓ ఓటరు జాబితాను చూడవచ్చు. అధికారిక వెబ్‌సైట్

మిగతా 3లో

### ఆరు రాష్ట్రాల హోంశాఖ

# కార్యదర్శుల తొలగింపు

**పశ్చిమ బెంగాల్ డీజీపీపై వేటు ● కేంద్ర ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం**




**ముందడుగు జాతీయం:**

దేశంలో లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం సంచలన నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా రాష్ట్రాల్లో లోక్ సభ ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని చెప్పిన ఈసీ అందుకు తగ్గట్టుగానే క్షేత్రస్థాయిలో మార్పులు చేర్పులు చేస్తోంది. అందులో భాగంగానే ఆరు రాష్ట్రాల హోంశాఖ కార్యదర్శులను తొలగిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. అలాగే పశ్చిమ బెంగాల్ డీజీపీని సైతం తప్పించింది.

గుజరాత్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ వంటి ఆరు రాష్ట్రాల్లో హోంశాఖ కార్యదర్శులను తొలగిస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. వీరితో పాటు మిజోరం, హిమాచల్ ప్రదేశ్‌లోని సాధారణ పరిపాలనా విభాగం కార్యదర్శిని కూడా తొలగించారు. అలాగే పశ్చిమ బెంగాల్ డీజీపీని కూడా తొలగించేలా ఈసీ ఆదేశాలు జారీ చేసింది. వీరితో పాటు బృహన్ ముంబై మున్సిపల్ కమిషనర్ ఇక్బాల్ సింగ్ చాహల్, అదనపు కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లను కూడా ఈసీ తప్పించింది. సిఎం కార్యాలయంలో బాధ్యతలు నిర్వహిస్తున్న జిఎడి మిజోరం, హిమాచల్ ప్రదేశ్‌ల కార్యదర్శిలను కూడా ఈసీఐ తొలగించినట్లు తెలుస్తోంది.

లోక్ సభ ఎన్నికలకు నెల రోజుల కంటే తక్కువ సమయం మాత్రమే ఉన్న నేపథ్యంలో ఈసీ చేపట్టిన ఈ బదిలీలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఎన్నికలు నిష్పాక్షితంగా నిర్వహించేందుకు వీలుగా ఈసీ ఈ బదిలీలు చేపట్టినట్లు చెబుతున్నారు. లోక్ సభ ఎన్నికలకు ఇప్పటికే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఏప్రిల్ 19న తొలిదశ పోలింగ్ ప్రారంభం కానుంది. జూన్ 1 వరకూ ఏడు దశల్లో పోలింగ్ కొనసాగనుంది. జూన్ 4న ఫలితాలు ప్రకటిస్తారు.




### మొత్తం ఉన్నది ఉన్నట్టు

# బయట పెట్టండి

**● ఎన్నికల బండ్లపై ఏ ఒక్కటి దాయకండి**
**● స్టేట్ బ్యాంక్ ను ఆదేశించిన సుప్రీంకోర్టు**

**ముందడుగు జాతీయం:**

రాజకీయ పార్టీలు విరాళాలకు సంబంధించిన ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు ఇప్పట్లో వదిలేలా కనిపించడం లేదు. ఇప్పటికే స్టేట్ బ్యాంక్ కు ఎన్నికల బాండ్ల వివరాలు బయటపెట్టాలంటూ రెండుసార్లు గడువు విధించిన సుప్రీంకోర్టు మరోసారి గడువు ఇచ్చింది. అయితే ఈసారి తమ వద్ద ఇంతకు మించి ఏదీ లేదనేలా ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలు బయటపెట్టాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది.

గత ఐదేళ్లలో రాజకీయ పార్టీలు జారీ చేసిన బాండ్లు, వాటి ద్వారా వ్యక్తులు, సంస్థల నుంచి స్వీకరించిన విరాళాలకు సంబంధించిన వివరాలు ఎన్నికల కమిషన్ కు సమర్పించాలని సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఆదేశాలు ఇచ్చినా ఎస్బీఐ మాత్రం అరకొర వివరాలే ఇచ్చింది. ఇందులో ఎన్నికల బాండ్ల వివరాలు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు.. ఇలాగైతే కోర్టు ధిక్కార చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించింది. దీంతో మరికొంత డేటాను ఎస్బీఐ బయటపెట్టింది. అయినా ఇంకా పూర్తి వివరాలు లభించకపోవడంపై సోమవారం మరోసారి సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా మార్చి 21 లోగా అంటే గురువారం లోపు ఎన్నికల బాండ్లకు సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించింది. గురువారం సాయంత్రం ఐదు గంటల్లోగా తమ దగ్గర ఇంకేమీ వివరాలు లేకుండా పూర్తి డేటా ఇవ్వాలని ఎస్బీఐ ఛైర్మన్ ను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు అఫిడవిట్ కూడా దాఖలు చేయాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఎస్బీఐ ఇప్పుడు తమ వద్ద ఉన్న అన్ని వివరాలు ఎన్నికల కమిషన్ కు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది.

### ఆప్ నేతలతో ఎమ్మెల్సీ కవిత

# అక్రమాలు

**● ఆప్ పార్టీకి రూ.100 కోట్లు చెల్లించారు**
**● డబ్బును వాటాలుగా పంచుకున్నారు**
**● ఈడీ అధికారుల ప్రకటన**




**ముందడుగు ఢిల్లీ:**

ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం కేసులో బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు అయ్యారు. కవిత అరెస్టుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 15న ఆమెను అరెస్టు చేసినట్లు పేర్కొంది. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ ప్రత్యేక కోర్టు 7 రోజుల కస్టడీకి అనుమతించగా.. ఈ నెల 23వ తేదీ వరకు కస్టడీకి తీసుకున్నట్లు ఈడీ తెలిపింది.

ఈ నెల 15న కవిత ఇంట్లో సోదాలు నిర్వహించాం. ఆ సమయంలో ఆమె బంధువులు, అనుచరులు మా విధులకు ఆటంకం కలిగించారు. ఆప్ నేతలతో కలిసి కవిత అక్రమాలకు పాల్పడినట్లు దర్యాప్తులో తేలింది. దిల్లీ సీఎం అర్వింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియాతో కలిసి కుట్ర పన్నారు. 202122 మిగతా 2లో

## మొబైల్ నంబర్ పోర్టబిలిటీలో కొత్త రూల్

వివరాలు 2లో

# హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తులు చేసుకోండి

**● ప్రచారంలో పాఠశాల విద్యార్థులు ఉండొద్దు**
**● ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు**
**● తెలంగాణ సీఈవో వికాస్ రాజ్ వెల్లడి**

**ముందడుగు తెలంగాణ:**

ఇంటి వద్ద ఓటింగ్ కోసం ఏప్రిల్ 22 లోపు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని, ఇందుకు ఫారండీ పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్ రాజ్ తెలిపారు. ఆర్వో వద్ద పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్ ఉంటుందని వివరించారు. గతేడాది అసెంబ్లీ ఎన్నికల వేళ 2.09 లక్షల మంది పోస్టల్, హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకున్నట్లు చెప్పారు. అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ తర్వాత 3, 4 రోజుల్లో హోమ్ ఓటింగ్ ఉంటుందని సీఈవో వెల్లడించారు. లోక్‌సభ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

**మరిన్ని అంశాలు..**

తెలంగాణలో మొత్తం ఓటర్లు మిగతా 2లో




# నా వ్యాఖ్యలు మోడీ వక్రీకరించారు

**అవినీతి, అసత్యాల గురించేనని క్లారిటీ ● మోడీపై విరుచుకుపడ్డ రాహుల్ గాంధీ**

**ముందడుగు జాతీయం :**




ప్రధాని మోడీ నా వ్యాఖ్యలను వక్రీకరించారని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'శక్తి'పైనే తమ పోరాటం అంటూ చేసిన వ్యాఖ్యలు అవి ఏ మతపరమైనవి కావని.. కేవలం అధర్మం, అవినీతి, అసత్యాల గురించేనని క్లారిటీ ఇచ్చారు. ఈసందర్భంగా ప్రధానిపై విరుచుకుపడిన ఆయన మోడీ వేసుకున్న 'ముసుగు పవర్'ను ఉద్దేశిస్తూ తాను అలా మాట్లాడానన్నారు. 'నా మాటలు మోదీకి ఇష్టముండదు. వాటిని మిగతా 2లో

### కాంగ్రెస్-బీఆర్ఎస్ రెండూ

# అవినీతి పార్టీలే

**● రాష్ట్ర పాలకుల అవినీతి ఢిల్లీ చేరింది**
**● కాళేశ్వరం అవినీతిపై మాట్లాడని కాంగ్రెస్**
**● జగిత్యాల ఎన్నికల ప్రచారంలో మోడీ**



వివరాలు 2లో

### జనన ధృవీకరణ పత్రమే అన్నిటికీ

# ఆధారం

**● ప్రతి పనికి బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి**
**● కొత్త చట్టాన్ని తీసుకు వచ్చిన కేంద్రం**




వివరాలు 2లో

ముందడుగు
మంగళవారం 19-3-2024

# హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తులు చేసుకోండి

మొదటిపేజీ తరువాయి

3.30 కోట్ల మంది, 85 ఏళ్లు దాటిన వారు 1.94 లక్షల మంది, దివ్యాంగులు, 85 ఏళ్ల వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం, సరిహద్దుల వద్ద 24 గంటలు పనిచేసేలా ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు, సరైన పత్రాలు లేకుండా రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్తే స్వాధీనం చేసుకుంటాం. ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై సీవిజిల్ యాప్ లేదా 1950 ద్వారా ఫిర్యాదు చేయాలి. ఎన్నికల ప్రచారంలో పాఠశాల విద్యార్థులను భాగస్వామ్యం చేయకూడదు. రోడ్‌షోలకు ముందస్తు అనుమతి తప్పనిసరి. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వాడకూడదు. ఆర్వో, డీఈవో, పోలీసు అధికారులకు ఢిల్లీలో శిక్షణ ఇచ్చాం. మరికొంత మందికి శిక్షణ ఇవ్వాల్సి ఉంది. ఎన్నికల కోసం 1,85,612 మంది పోలీసు సిబ్బంది నియామకం. 35,365 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. పోలింగ్ కోసం 54,353 వీవీ ప్యాట్‌లు అందుబాటులో ఉన్నాయి. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఉప ఎన్నిక కోసం 500 బీయూలు, 500 వీవీ ప్యాట్లు ఉపయోగిస్తున్నాం.

# మొబైల్ నంబర్ పోర్టబిలిటీలో కొత్త రూల్

## జులై 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి

ముందడుగు జాతీయం:

మొబైల్ నంబర్ పోర్టబిలిటీ విషయంలో ట్రాయ్ కొత్త నిబంధన తీసుకొచ్చింది. సిమ్ కార్డ్ స్వాప్ లేదా రీప్లేస్ చేసిన ఏడు రోజుల వరకు వేరే నెట్‌వర్క్‌కు మారడాన్ని నిలిపివేసింది. సిమ్ స్వాప్ మోసాలను అరికట్టేందుకు గానూ ట్రాయ్ ఈ నిర్ణయం తీసుకుంది. జులై 1 నుంచి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి.

సిమ్ పేరుతో జరిగే మోసాలు పెరిగిపోతున్న నేపథ్యంలో వీటికి చెక్ పెట్టాలంటూ టెలికాం విభాగం రాసింది. దీంతో ట్రాయ్ కొత్త మార్పు చేపట్టింది. ఈ కొత్త నిబంధనతో కూడిన సర్క్యులర్‌ను గత వారం జారీ చేసింది. దీని ప్రకారం.. ఎవరైనా వ్యక్తి సిమ్ కార్డు మార్చుకున్నా, స్వాప్ చేసినా వారం రోజుల వరకు వేరే నెట్‌వర్క్‌కు మారేందుకు అవసరం అయ్యే యునిక్ పోర్టింగ్ కోడ్‌ను (UPC) జారీ చేయరు. కొత్త వ్యక్తి పేరుతో అదే నంబర్‌ను తీసుకోకుండా కేటుగాళ్లను నిలువరించే ఉద్దశంతో ఈ నిబంధన తీసుకొచ్చినట్లు ట్రాయ్ తెలిపింది.

సాధారణంగా సిమ్ కార్డు పోతేనో లేదా పాడైతేనో సంబంధిత టెలికాం సంస్థను ఆశ్రయిస్తే.. కొత్త సిమ్ కార్డును జారీ చేస్తుంటాయి. వేరే నెట్‌వర్క్‌కు మారాలంటే ప్రస్తుత మొబైల్ నంబర్ నుంచి PORTను 1900కు ఎస్సెమ్మెస్ పంపించాల్సి ఉంటుంది. దీంతో మీకో యునిక్ కోడ్ వస్తుంది. ఇతర నెట్‌వర్క్‌కు మారేటప్పుడు ఈ నంబర్ ఇవ్వాల్సి ఉంటుంది. 2009లో తొలిసారి పోర్టబిలిటీ విధానం అమల్లోకి వచ్చింది.



# ఆప్ నేతలతో ఎమ్మెల్సీ కవిత అక్రమాలు

మొదటిపేజీ తరువాయి

ఏడాదిలో మద్యం కుంభకోణానికి పాల్పడ్డారు. మద్యం పాలసీని నిబంధనలకు విరుద్ధంగా రూపొందించారు. హోల్‌సేల్ డీలర్ల నుంచి వచ్చిన డబ్బును వాటాలుగా పంచుకున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీకి కవిత రూ.100 కోట్లు చెల్లించారు. ఈ కేసులో ఇప్పటివరకు హైదరాబాద్, చెన్నై, ముంబయి సహా 245 ప్రాంతాల్లో సోదాలు చేశాం. మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్‌తోపాటు మొత్తం 15 మందిని అరెస్టు చేశాం. రూ. 128.79 కోట్ల నగదు సీజ్ చేశాం'' అని పేర్కొంది. కేసులో ఒక నేరాభియోగపత్రం, 5 అనుబంధ పత్రాలు దాఖలు చేసినట్లు తెలిపిన ఈడీ.. ఇంకా లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించింది.

# గెలుపు గుర్రాలపై కాంగ్రెస్ కసరత్తు

- సోనియా గాంధీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- రేపో, మాపో తుది జాబితాను విడుదలయ్యే అవకాశం

ముందడుగు తెలంగాణ:

దేశంలో సార్వత్రిక ఎన్నికల నగారా మోగిన వేళ.. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పట్టును నిలపుకోవడానికి అవసరమైన కసరత్తు సాగిస్తోంది. ఇందులో భాగంగా చేరికలకు గేట్లు ఎత్తేసింది. ప్రతిపక్ష పార్టీ బిఆర్ఎస్ నుంచి పెద్ద ఎత్తున నాయకులను ఆకర్షించడం మొదలుపెట్టింది. ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన అయిదుమంది సిట్టింగ్ ఎంపీలు పార్టీ ఫిరాయించారు. కాంగ్రెస్/బీజేపీ కండువాలను కప్పుకొన్నారు. పెద్దపల్లి, చేవెళ్ల, వరంగల్ ఎంపీలు బీ వెంకటేష్ నేత, కే రంజిత్ రెడ్డి, పసునూరి దయాకర్.. కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కొందరు సిట్టింగ్ ఎమ్మెల్యేలూ బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. ఈ పరిస్థితుల్లో లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది కాంగ్రెస్ పార్టీ. ఇప్పుడున్న తన సీట్ల సంఖ్యను భారీగా పెంచుకోవడంపై దృష్టి సారించింది. తెలంగాణలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. అత్యధికం బీఆర్ఎస్ ఖాతాలో ఉన్నాయి. తొమ్మిది స్థానాల్లో గులాబీ జెండా ఎగురుతోంది. నాలుగు చోట్ల బీజేపీ అభ్యర్థులు విజయం సాధించారు. మరో మూడింటిని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంది. ఏఐఎంఐఎం ఒక స్థానాన్ని నిలబెట్టుకుంది. కాంగ్రెస్ చేతిలో ఉన్న ముడుకు మూడు



లోక్‌సభ స్థానాలు ఖాళీ అయిన విషయం తెలిసిందే. రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. తమ లోక్‌సభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. వీటితో పాటు అన్ని లోక్‌సభ నియోజకవర్గాలను గెలచుకోవడంపై కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. గెలుపు గుర్రాలకు టికెట్లు ఇవ్వనుంది. ఇప్పటికే నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన విషయం తెలిసిందే. చేవెళ్ల పట్నం సునీత మహేందర్ రెడ్డి, జహీరాబాద్ సురేష్ కుమార్ షెట్కార్, నల్గొండ కుందూరు రఘువీర్, మహబూబాబాద్ పోరిక బలరామ్ నాయక్ పేర్లు ఉన్నాయి. మిగిలిన వాటిపై పార్టీ అధిష్ఠానం ఆమోద ముద్ర వేయాల్సి ఉంది. దీనికోసం రేవంత్ రెడ్డి ప్రస్తుతం ఢిల్లీ వెళ్లారు. కొద్దిసేపటి కిందటే అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మాజీ అధినేత్రి సోనియా గాంధీతో భేటీ అయ్యారు. లోక్‌సభ అభ్యర్థుల తుది జాబితాను ఈ రాత్రికి విడుదల చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

# జనన ధృవీకరణ పత్రమే అన్నిటికీ ఆధారం

ముందడుగు జాతీయం:

ఇకపై జనన ధృవీకరణ పత్రమే అన్నిటికీ ఆధారం అని కేంద్రం కొత్త చట్టం చెబుతోంది. విద్యా సంస్థల్లో ప్రవేశంతో పాటు నియామకాలతో సహా దేనికైనా జనన దృవీకరణ పత్రము ప్రధానమని కేంద్రం పేర్కొంది. ఇక కేంద్రం ఇచ్చిన ఆదేశాలతో ఏపీలోనూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లను త్వరితగతిన మంజూరు చేయాలని అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. పుట్టిన వ్యక్తి యొక్క తేదీని, ప్రదేశాన్ని నిర్ధారించేది జనన ధ్రువీకరణ పత్రం. అయితే చాలామంది బర్త్ సర్టిఫికెట్ తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తారు. గత సంవత్సరం అక్టోబర్ 1 తర్వాత పుట్టిన వారికి జనన ధ్రువీకరణ పత్రాన్ని కేంద్రం తప్పనిసరి చేసింది.

ఇకనుండి ఏ పని జరగాలన్నా కచ్చితంగా బర్త్ సర్టిఫికెట్ ఉండాలని, కేంద్రం చట్టాన్ని తీసుకురావడంతో ప్రజలలో దీనిపైన పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని, తప్పనిసరిగా గత ఏడాది అక్టోబర్ నుండి జన్మించిన పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలని, భవిష్యత్తులో ఇదే ఏపీ సి ఎస్ అవసరమవుతుందని చెబుతున్నారు. పాస్ ఫోర్ట్, ఆధార్, ఓటర్ ఐడి కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయడానికి, వివాహ రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి.. ఇలా ప్రతి ఒక్కదానికి బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి అని చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలకు దీనిపైన అవగాహన కల్పించాలని చెప్పిన సి ఎస్ ఆసుపత్రులలోను, నగర పంచాయతీలు, పంచాయతీలలోను జనన, మరణాలను నమోదు చేయడానికి, ధ్రువీకరణ పత్రం ఇవ్వడానికి మొత్తం 14 వేల 752 యూనిట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

# కాంగ్రెస్-బీఆర్ఎస్ రెండూ అవినీతి పార్టీలే

ముందడుగు జగిత్యాల:


రాష్ట్ర పాలకుల అవినీతి డిల్లీ వరకు చేరిందని, బీఆర్ఎస్, కాంగ్రెసు కలసి ఉన్నాయని, బీఆర్ఎస్ అవినీతిపై కాంగ్రెసు పాలకులు మౌనం వహిస్తున్నారని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. తెలంగాణ రాష్ట్రం జగిత్యాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మోడీ ఆసక్తికరవ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజలు చరిత్ర సృష్టిస్తారని, తెలంగాణ రాష్ట్ర వికాసం కోసం బిజెపికి ఓటు వేయాలని ప్రధాని నరేంద్ర మోడీ విజ్ఞప్తి చేశారు. ఇక ఇదే సమయంలో కవిత అరెస్టుపై మొదటిసారి స్పందించిన మోడీ ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కెసిఆర్ కుటుంబం అవినీతికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్‌బీఆర్ఎస్ పార్టీలు కలసి పనిచేస్తున్నాయని, రెండూ అవినీతి పార్టీలనీ, కుటుంబ పార్టీలనీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆరోపించారు. అవినీతి పార్టీలను తిరస్కరించాలని రాష్ట్ర ప్రజలను కోరారు. దేశ అభివృద్ధి కోసం తాను నిరంతరం పరిశ్రమిస్తానని, కుర్చీ కోసం చూడకుండా ప్రజలకు లబ్ది చేకూర్చే నిర్ణయాలనే తాను తీసుకుంటానని మోడీ చెప్పారు.

తెలంగాణ అభివృద్ధి కోసం గ్యారంటీ ఇస్తున్నట్లు హామీ ఇచ్చారు. అవినీతికి పాల్పడిన ఎవ్వరినీ తాను ఒదిలి పెట్టబోనని కూడా మోడీ హామీ ఇచ్చారు. జగిత్యాల విజయ సంకల్ప సభలో మాట్లాడుతూ, ప్రజలకు మేలు చేసే నిర్ణయాలే తాను, తీసుకుంటానని మోడీ స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు శక్తి పేరిట చేసిన ఆరోపణలను తిప్పికొడుతూ, ప్రతి మహిళలో, బాలికలో తాను శక్తిని దర్శిస్తానని, దేశంలో భారతమాత శక్తిని చూస్తానని వివరించారు. ప్రతిపక్షాల 'శక్తి' ఆరోపణల సవాలును తాను స్వీకరిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఎవరైనా శక్తిని ఎలా నాశనం చేస్తారని ఆయన ప్రతిపక్షాలను ప్రశ్నించారు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య ఉత్సవం మొదలయిందనీ చెబుతూ, ఈ నెలలోనే 5 సార్లు రాష్ట్రంలో పర్యటించినట్లు, రాష్ట్రంలోని ప్రతి ప్రాంతానికీ అభివృద్ధి చేరుతోందని గుర్తు చేసుకున్నారు. గత పదేళ్ళలో తెలంగాణాలో జరగాల్సినంత అభివృద్ధి చెందలేదని ఆరోపించారు.

కాళేశ్వరం అవినీతిపై కాంగ్రెసు మాట్లాడటం మానేసిందని చెప్పారు. నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి నూంచి పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులనుమోదీ ప్రజలకు పరిచయం చేశారు. ట్విటర్ పై నమో తెలుగు అకౌంటు కు వెళ్ళి తనతో తెలుగులో మాట్లాడవచ్చని పేర్కొన్నారు. వాటిలో లోపాలను చెప్పి తెలుగు నేర్చుకోవటంలో తనకు సాయం చేయాలని మోదీ కోరారు. రైతులు, యువతులు, మహిళలు, పేదల సంక్షేమంకోసం తాము చేస్తున్న కృషిలో కలసి రావాలని ప్రజలను కోరారు. AI తో తన సంభాషణాలు, ప్రసంగాలను నమో తెలుగు ఆప్ లో వినాలని కోరారు.

# విధుల్లో ఉన్న టీచర్‌పై హెడ్ కానిస్టేబుల్ కాల్పులు

## అక్కడికక్కడే మృతి చెందిన ఉపాధ్యాయుడు




ముందడుగు ఉత్తరప్రదేశ్:

పాఠశాలలో పరీక్షల విధుల్లో ఉన్న ఒక ప్రభుత్వ టీచర్‌ను సెక్యూరిటీ విధుల్లో ఉన్న పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గన్‌తో కాల్పులు జరిపి చంపాడు. మద్యం సేవించి ఉన్న ఆ పోలీస్, పొగాకు ఇవ్వనందుకు టీచర్‌ను హత్య చేశాడు. ఉత్తరప్రదేశ్‌లోని ముజాఫర్‌నగర్‌లో ఈ సంఘటన జరిగింది. వారణాసికి చెందిన విద్యా శాఖ అధికారులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు కలిసి పోలీస్ భద్రత మధ్య బోర్డ్ హైస్కూల్ పరీక్షల జవాబు పత్రాలను పలు కాలేజీలకు వాహనంలో తరలించారు. ఆదివారం రాత్రి చివరగా ముజాఫర్‌నగర్‌లోని కాలేజీకి వాటిని తీసుకువచ్చారు. వాహనంలో ఉన్న పోలీస్ హెడ్ కానిస్టేబుల్ చందర్ ప్రకాష్ మద్యం సేవించాడు. ప్రభుత్వ ఉపాధ్యాయుడైన ధర్మేంద్ర కుమార్‌ను పొగాకు అడిగాడు. ఆ టీచర్ ఇవ్వకపోవడంతో వారి మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో తన వద్ద ఉన్న సర్వీస్ గన్‌తో ధర్మేంద్ర కుమార్‌పై కాల్పులు జరిపాడు. తీవ్రంగా గాయపడిన అతడ్ని ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

ఉపాధ్యాయుడు ధర్మేంద్ర కుమార్‌పై కాల్పులు జరిపి హత్య చేసిన పోలీస్ హెడ్ కానిస్టేబుల్ చందర్ ప్రకాష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏం జరిగిందన్న దానిపై ఆ వాహనంలో ఉన్న మిగతా వారిని ప్రశ్నించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

# నా వ్యాఖ్యలు మోడీ వక్రీకరించారు

మొదటిపేజీ తరువాయి

వక్రీకరిస్తూ ఏదోవిధంగా అర్థాలు మార్చేందుకు ప్రయత్నిస్తుంటారు. ఎందుకంటే నేను మట్లాడేవి గంభీరమైన వాస్తవాలని వారికి తెలుసు' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తాను పేర్కొన్న 'శక్తి'.. మోదీ వేసుకున్న ముసుగు గురించేనన్నారు. దానిపైనే తాము పోరాడుతున్నామని చెప్పారు. సీబీఐ, ఈడీ, ఈసీ, మీడియాతోపాటు అన్ని వ్యవస్థలను ప్రభావితం చేసే శక్తి వారికుందన్నారు. కొన్ని వేల రూపాయల రుణాలను చెల్లించలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే.. రూ.వేల కోట్ల విలువైన బ్యాంకు రుణాలను ప్రధాని మాఫీ చేస్తున్నారని ఆరోపించారు. ఇదిలాఉంటే, 'శక్తి'ని నాశనం చేస్తామంటూ కొందరు సవాళ్లు విసురుతున్నారని, తాను వాటిని స్వీకరిస్తున్నట్లు రాహుల్ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని మోదీ స్పందించారు. జగిత్యాలలో (తెలంగాణ) జరిగిన



భాజపా 'విజయ సంకల్ప సభ'లో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతల ప్రకటనలను తిప్పికొట్టారు. ఈ దేశంలోని ప్రతి మహిళ, కుమార్తె ఆ శక్తి స్వరూపమేనని.. దానిని నాశనం చేస్తామని విపక్ష కూటమి మేనిఫెస్టోలో పెట్టుకున్నారని దుయ్యబట్టారు. సవాల్‌కు సిద్ధమంటూ మోడీ చెప్పడంపై రాహుల్ ఇలా స్పందించారు.


## చిన్నప్పటి ఫొటో అప్‌లోడ్ చేసాడని

# ఖాతా బ్లాక్

- 'చైల్డ్ అబ్యూజ్' కిందకు వస్తుందంటున్న గూగుల్
- హైకోర్టు ఆశ్రయించిన బాధితుడు

ముందడుగు గుజరాత్:

ఒక వ్యక్తి తన జ్ఞాపకాల కోసం చిన్నప్పటి ఫొటోను డ్రైవ్‌లోకి అప్‌లోడ్ చేసినందుకు ఆ వ్యక్తికి గూగుల్ షాకిచ్చింది. అతడి అకౌంట్‌ను బ్లాక్ చేసింది. దీనిపై అతడు ఏడాదిగా గూగుల్‌తో పోరాడుతున్నా ఫలితం లేకుండా పోయింది. చివరికి గుజరాత్ హైకోర్టు తలుపు తట్టాడు. దీంతో సెర్చ్ ఇంజిన్ దిగ్గజంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. గుజరాత్‌కు చెందిన కంప్యూటర్ ఇంజినీర్ నీల్‌శుక్లా చిన్నప్పటి జ్ఞాపకాలను పదిలపర్చుకోవడంలో భాగంగా కొన్ని ఫొటోలను గతేడాది ఏప్రిల్‌లో గూగుల్ డ్రైవ్‌లోకి అప్‌లోడ్ చేశాడు. తన రెండేళ్ల వయసులో నాన్నమ్మ అతడికి స్నానం చేయిస్తున్న ఫొటో కూడా అందులో ఉంది. ఫొటోలో దుస్తుల్లేకుండా ఉండడం 'చైల్డ్ అబ్యూజ్' కిందకు వస్తుందంటూ అతడి ఖాతాను గూగుల్ బ్లాక్ చేసింది. దీంతో వివరణ ఇస్తూ ఖాతాను పునరుద్ధరించాలని గూగుల్‌ను పదే పదే అభ్యర్థించినా ఫలితం లేకపోయింది. దీంతో కోర్టును ఆశ్రయించాడు. ఏడాదిగా ఖాతా నిలిచిపోవడం వల్ల ఇమెయిల్ అకౌంట్‌ను వినియోగించలేకపోతున్నానని




శుక్లా తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. ముఖ్యమైన ఇమెయిల్స్ చూడలేని కారణంగా తన వ్యాపారానికి నష్టం వాటిల్లిందని తెలిపాడు. ఈ విషయమై గుజరాత్ పోలీసులకు, భారత్‌లో నోడల్ ఏజెన్సీ అయిన సెంటర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీని ఆశ్రయించినా ఫలితం లేకుండా పోయిందని వాపోయాడు. ఖాతాను నిలిపివేసి ఏడాది కావొస్తుండడంతో మరోసారి గూగుల్ అతడికి నోటీసులు పంపించింది. ఖాతాతో అనుసంధానమై ఉన్న డేటా మొత్తాన్ని ఏప్రిల్ కల్లా తొలగిస్తామని పేర్కొంది. ఈ వ్యవహారంపై సత్వరమే విచారణ జరపాలని న్యాయస్థానాన్ని న్యాయవాది ద్వారా ఆశ్రయించాడు. దీంతో కోర్టు.. గూగుల్‌తో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మార్చి 26లోగా సమాధానం ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది.

ముందడుగు
మంగళవారం 19-3-2024

# అన్నాడీఎంకే పార్టీకి రూ.6.05కోట్ల విరాళాలు

## చెన్నై సూపర్ కింగ్స్ నుంచే రూ.5కోట్లు




**ముందడుగు తమిళనాడు:**
దేశంలో ఎన్నికల బాండ్ల రూపంలో రాజకీయ పార్టీలకు అందిన విరాళాల జాబితాను కేంద్ర ఎన్నికల సంఘం బహిర్గతం చేసిన విషయం తెలిసిందే. వీటితో ఏ పార్టీకి ఎంత మొత్తం దక్కిందనే సమాచారం బయటికొచ్చింది. కొన్ని పార్టీలు ఈ బాండ్లతో తమకు ఎవరు విరాళం ఇచ్చారనే విషయాన్ని కూడా ఈసీతో పంచుకున్నాయి. అలా తమిళనాడుకు చెందిన ప్రతిపక్ష అన్నాడీఎంకే చెప్పిన దాతల పేర్లలో ఒకటి అందరిని ఆకర్షించింది. అదే చెన్నై సూపర్ కింగ్స్. ఆ పార్టీకి దక్కిన ఎన్నికల బాండ్లలో ఈ ఫ్రాంచైజీ యాజమాన్యానిదే మెజార్టీ వాటా.
ఈసీ గణాంకాల ప్రకారం.. ఎన్నికల బాండ్ల ద్వారా అన్నాడీఎంకే పార్టీకి రూ.6.05కోట్ల విరాళాలు అందాయి. ఇందులో దాదాపు రూ.5కోట్లు సీఎస్‌కే యాజమాని చెన్నై సూపర్‌కింగ్స్ క్రికెట్ లిమిటెడ్ ఇచ్చినవే. 2019 ఏప్రిల్ 2 నుంచి 4 తేదీల్లో ఈ మొత్తాన్ని పార్టీ అందుకుంది. దీంతోపాటు కోయంబత్తూరుకు చెందిన ఓ కంపెనీ రూ.కోటి, గోపాల్ శ్రీనివాసన్ అనే వ్యక్తి రూ.5 లక్షలు అన్నాడీఎంకేకు బాండ్ల రూపంలో విరాళమిచ్చినట్లు డేటాలో ఉంది. 2019 తర్వాత ఈ పార్టీకి ఎన్నికల బాండ్ల నుంచి ఎలాంటి నిధులు రాలేదు. కాగా.. సీఎస్‌కే యాజమాన్యం విరాళం విషయాన్ని గతంలో పార్టీ కోఆర్డినేటర్ ఒ.పన్నీర్ సెల్వం(ఇప్పుడు బహిష్కృత నేత) రెండుసార్లు ఈసీకి వెల్లడించారు. ఆ తర్వాత 2023లో అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ కూడా ఇదే సమాచారాన్ని పంచుకున్నారు.



# 300మంది మహిళలకు మహిళాశక్తి అవార్డులు

## ప్రఖ్యాత సంస్థ ఉమెన్‌నర్జీ ఆధ్వర్యంలో నిర్వహణ

**ముందడుగు హైదరాబాద్:**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని, మహిళా సాధికారత కోసం పనిచేస్తున్న ప్రఖ్యాత సంస్థ ఉమెన్‌నర్జీ తెలంగాణ మహిళా అవార్డుల వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో యునైటెడ్ తెలంగాణ లోకల్ ఉమెన్స్ అసోసియేషన్ ఫ్రంట్ ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీతారెడ్డి, కాంటినెంటల్ హాస్పిటల్స్ వైస్ చైర్మన్ మరియు డయాబెటిస్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ అనురాధారెడ్డి, అగ్రి ఇండస్ట్రియలిస్ట్ సుధా రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని అవార్డు గ్రహీత మహిళల్లో స్ఫూర్తిని నింపారు. 36 విభిన్న స్వచ్ఛంద సంస్థలకు చెందిన 300 మంది ప్రముఖ మహిళలను అవార్డులతో సత్కరించింది. 1500 వందల మంది హాజరైన ఈ కార్యక్రమంలో మరెన్నో సంస్థలు పాల్గొన్నాయి. ఉమెన్‌నర్జీ, వీఎయిమ్ మరియు యునైటెడ్ తెలంగాణ లోకల్ ఉమెన్స్ అసోసియేషన్ ఫ్రంట్ వ్యవస్థాపకురాలు దీప్తి రెడ్డి మాడుగుల, తెలంగాణాలో మహిళల అభివృద్ధి కార్యక్రమాలకు ప్రమోటర్‌గా ఉన్నారు. గత దశాబ్దంలో ఆమె ఎడతెగని ప్రయత్నాలు వారి వ్యవస్థాపక ప్రయాణంలో 10,000 మంది మహిళలకు మద్దతునిచ్చాయి. వివిధ రంగాల్లో స్థానిక తెలంగాణ మహిళలు చేస్తున్న కృషిని గుర్తించి అభినందించేందుకు ఈ కార్యక్రమం వేదికైంది.

# అఫ్గానిస్థాన్‌పై పాకిస్తాన్ వైమానిక దాడులు


**ఎనిమిది మంది మృతి**

**ముందడుగు జాతీయం:**
ఉగ్ర వాదులకు ఆశ్రయం ఇస్తోందనే సాకుతో అఫ్గానిస్థాన్‌పై పాకిస్థాన్ సోమవారం వైమానిక దాడులు చేసింది. మొత్తం రెండు దాడుల్లో ముగ్గురు పిల్లలు సహా ఐదుగురు మహిళలు ప్రాణాలు కోల్పోయారు. ఈ చర్యను అఫ్గానిస్థాన్ ప్రతినిధి ఖండించారు. ఈ చర్య తమ దేశ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించిందని చెప్పారు. ''ఇస్లామిక్ ఎమరేట్ ఆఫ్ అఫ్గానిస్థాన్ సార్వభౌమత్వం విషయంలో ఏమాత్రం రాజీ పడదు. పాకిస్థాన్ స్వదేశంలో ఉగ్రవాదాన్ని అణచివేయలేక మమ్మల్ని నిందించడం తగదు. అక్కడి ప్రభుత్వంలోనే అసమర్థత నెలకొంది. ఇలాంటి చర్యలకు (వైమానిక దాడుల వంటి) తీవ్ర పరిణామాలు ఉంటాయి. వాటిని అదుపుచేయడం పాక్ వల్ల కాదు'' అని జబియుల్లా ముజాహిద్ పేర్కొన్నారు. తూర్పు ప్రావిన్స్‌లోని ఖోస్ట్, పాక్టికలో సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పాకిస్థాన్ విమానాలు దాడులు నిర్వహించాయి. ఇప్పటికే పాక్‌అఫ్గాన్ సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ఈ దాడులు జరగడం గమనార్హం. వీటిపై పాక్ విదేశాంగశాఖ నోరు మెదపలేదు. పాకిస్థాన్‌లోని ఖైబర్ ప్రాంతంలో రెండ్రోజుల క్రితం భారీ ఆత్మాహుతి దాడి జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు భద్రతా సిబ్బంది మరణించారు. వీరి అంత్యక్రియల సందర్భంగా పాక్ అధ్యక్షుడు ఆసీఫ్ అలీ జర్దారీ స్పందిస్తూ కచ్చితంగా తమ వీరుల త్యాగాలు వృథాగా పోవని ప్రతిజ్ఞ చేశారు. టీటీపీ ఉగ్రవాదులే ఈ దాడి చేసినట్లు అనుమానిస్తున్నారు. ఈ సంస్థను అఫ్గాన్ భూభాగం కేంద్రంగా నడిపిస్తున్నారు.



# తొలిరోజు పరీక్ష రాసిన 12 లక్షల మంది విద్యార్థులు

## తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు



**ముందడుగు తెలంగాణ:**
తెలుగు రాష్ట్రాలలో సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఏప్రిల్ 2 వరకు ఈ పరీక్షలు కొనసాగనున్నాయి. ఈసారి 5 నిమిషాలు ఆలస్యంగా వచ్చినా అనుమతించడంతో అధికారులు తెలపడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. దీంతో అధికారులు 9.35 నిమిషాల వరకు విద్యార్థులను ఆయా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 2,676 పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరుగుతున్నాయి. 5 లక్షల 8 వేల 385 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తున్నారు. తెలంగాణలో హాల్ టికెట్లు చూపించిన విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత ప్రయాణం కల్పిస్తోంది. పదో పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద తగిన పోలీసు బందోబస్తును కూడా ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ ఎ. కృష్ణారావు తెలిపారు.2,676 మంది చీఫ్ సూపరింటెండెంట్లు.. 2,676 డిపార్ట్‌మెంటల్ అధికారులు... పరీక్ష విధుల కోసం 30 వేల మంది ఇన్విజిలేటర్లను నియమించారు.మాల్‌ప్రాక్టీస్ కేసులను అరికట్టేందుకు అధికారులు 144 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారులు సిట్టింగ్ స్క్వాడ్‌లను కూడా ఏర్పాటు చేశారు.

# తాను మరణిస్తూ మరో ఇద్దరికి ఊపిరిపోశాడు..

## రోడ్డు ప్రమాదంలో జొమాటో డెలివరీ బాయ్



**ముందడుగు హైదరాబాద్:**
రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం, వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ళ బిశ్వాల్ ప్రభాస్, స్థానిక కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతూ, పార్ట్ టైమ్ జాబ్ కింద జొమాటో ఫుడ్ డెలివర్ బాయ్ గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే ఈనెల 14 వ తేదీన యాక్సిడెంట్ కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడ్డ బిశ్వాస్ ప్రభాస్ ని హుటాహుటిన దగ్గర్లోని కాంటినెంటల్ ఆసుపత్రి తీసుకొచ్చారు. ప్రభాస్ పరిస్థితిని పరిశీలించిన డాక్టర్లు.. తనకు బ్రెయిన్ డెడ్ అయ్యిందని ప్రభాస్ తల్లిదండ్రులకు చెప్పారు. కొనఊపిరితో ఉన్న ప్రభాస్ ను రక్షించడం కష్టమని డాక్టర్లు తెలిపారు. అదే సమయంలో అవయవదానం గురించి ప్రభాస్ తల్లిదండ్రులకు వివరించారు. కొడుకు పరిస్థితిని చూసి కన్నీరుమున్నరయిన తల్లిదండ్రులు.. గొప్పమనసుతో కొడుకు అవయవాలను దానం చేసి ఇతరులకు జీవం పోయడం నిజంగా గ్రేట్ అని చెప్పాలి. అలా ప్రభాస్ నుంచి సేకరించిన కాలేయాన్ని ఇవ్వాళ కాంటినెంటల్ ఆసుపత్రిలో వేరేవాళ్ళకు, చాలా శ్రమపడి విజయవంతంగా డాక్టర్ సెంథిల్ కుమార్ అండ్ టీమ్ అమర్చారు. ఇలా అవయవదానం చేయడం వల్ల ఇతరుల ప్రాణాలను కాపాడ్డం అనేది చాలా గొప్పవిషయమని కాంటినెంటల్ హాస్పిటల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ గురు ఎన్ రెడ్డి అన్నారు.

# మీ ఓటు ఎక్కడుందో తెలుసుకోండి..

## సీఈఓ అధికారిక వెబ్‌సైట్‌లో ఓటర్ లిస్ట్ • పీడీఎఫ్ డౌన్ లోడ్ చేసుకునే విధానం

**ముందడుగు జాతీయం:**
మన ఓటు హక్కు అసలు ఎక్కడ ఉందో, అసలు ఉందో, లేదో అందరూ ఆన్‌లైన్ ద్వారా ఓటర్ల జాబితాలను చూసుకోవచ్చు. దీని కోసం మీరు సీఈఓ ఓటర్ లిస్ట్ అధికారిక వెబ్‌సైట్‌కి వెళ్లాలి. ఈ వెబ్‌సైట్‌ని సందర్శించడం ద్వారా, మీరు సిఈఓ ఓటరు జాబితాను చూడవచ్చు. అధికారిక వెబ్‌సైట్ https://voters.eci.gov.in ద్వారా ఓటరు జాబితాలో మీ పేరు కనిపిస్తుంది. ఓటరు జాబితాలో మీ పేరు చూడటానికి మీరు ఏ ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లాల్సిన అవసరం లేదు. మీరు ఇంటర్నెట్ ఉపయోగించి అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. ప్రతి రాష్ట్ర ఓటర్ల జాబితా ఆ రాష్ట్ర సీఈవో లేదా చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది.

### ఓటర్ల జాబితాలో మీ పేరును వెతికే విధానం

ముందుగా నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్ అధికారిక వెబ్‌సైట్ https://voters.eci.gov.in లోకి వెళ్లాలి. హోమ్ పేజీలో సెర్చ్ ఇన్ ఎలక్టోరల్ రోల్ ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ఓటరు జాబితాలో సెర్చ్ చేయండి. ఇప్పుడు




డిస్క్రిప్షన్ ద్వారా సెర్చ్ లేదా ఐడెంటిటీ కార్డ్ ద్వారా సెర్చ్ ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ఆ తరువాత, మీరు మీ పేరు, వయస్సు, పుట్టిన తేదీ, రాష్ట్రం, జిల్లా మొదలైన అన్ని ముఖ్యమైన సమాచారాన్ని నమోదు చేయాలి. ఆ తర్వాత సెర్చ్ ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ఈ విధంగా ఓటరు జాబితాలో మీ పేరును సెర్చ్ చేయవచ్చు.

### సీఈఓ ఓటరు జాబితా ఈ-ఎపిక్ డౌన్ లోడ్ చేసుకునే విధానం

ముందుగా నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్ అధికారిక వెబ్‌సైట్ https://voters.eci.gov.in/లోకి వెళ్లాలి. హోమ్ పేజీలో ఈఎపిక్ డౌన్లోడ్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఇప్పుడు యూజర్ నేమ్, పాస్ వర్డ్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాలి. ఆ తర్వాత లాగిన్ ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ఇప్పుడు మీరు మీ ఎపిక్ నంబర్ లేదా రిఫరెన్స్ నంబర్ ఎంటర్ చేయాలి. తరువాత, మీరు మీ రాష్ట్రాన్ని ఎంచుకోవాలి. ఇప్పుడు సెర్చ్ ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ఇప్పుడు ఎపిక్ మీ ముందుకు వస్తుంది. డౌన్‌లోడ్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. తద్వారా మీరు ఎపిక్‌ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు.


### రాష్ట్రాల వారీగా సీఈవో తుది జాబితా

ఆంధ్రప్రదేశ్ ఓటర్ల జాబితా కోసం ఈ సైట్‌లోకి వెళ్లండి. (https://ceoandhra.nic.in)
తెలంగాణ ఓటర్ల జాబితా కోసం ఈ సైట్‌లోకి వెళ్లండి. (https://ceotelangana.nic.in/)

**ఓటరు జాబితా పీడీఎఫ్ డౌన్ లోడ్ చేసుకునే విధానం**

ముందుగా నేషనల్ ఓటర్ సర్వీస్ పోర్టల్ అధికారిక వెబ్‌సైట్ https://voters.eci.gov.in/ లోకి వెళ్లాలి. హోమ్ పేజీలో మీరు ఓటరు రోల్ పిడిఎఫ్ డౌన్లోడ్ ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ఓటర్ల జాబితా పీడీఎఫ్ డౌన్లోడ్ ఆప్షన్ వస్తుంది. ఇప్పుడు మీరు మీ రాష్ట్రాన్ని ఎంచుకోవాలి. ఆ తర్వాత గో ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ఇప్పుడు మీరు మీ రాష్ట్రం, ఎల్ఏసీ, పోలింగ్ స్టేషన్, మదర్ రోల్ / సప్లిమెంట్, క్యాప్చా కోడ్‌ను నమోదు చేయాలి. ఆ తర్వాత వ్యూ రోల్ ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ఇప్పుడు ఓటర్ల జాబితా మీ ముందు ఓపెన్ అవుతుంది. ఆ తర్వాత డౌన్‌లోడ్ ఆప్షన్ పై క్లిక్ చేయాలి. ఈ విధంగా, మీరు ఓటరు జాబితా పిడిఎఫ్ ను డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

మంగళవారం 19-3-2024



# 'టిల్లు స్క్వేర్' నుంచి 'ఓ మై లిల్లీ' పాట విడుదల



స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ 'డీజే టిల్లు' చిత్రంతో సంచలన బ్లాక్‌బస్టర్‌ను అందుకున్నాడు. ఆ సినిమాలో ఆయన పోషించిన టిల్లు పాత్ర యువతలో కల్ట్ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. టిల్లుగా సిద్ధు పంచిన వినోదాన్ని ప్రేక్షకులు అంత తేలికగా మరిచిపోలేరు. టిల్లు మాటలు, చేష్టలు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానాన్ని సంపాదించుకున్నాయి. ఇప్పుడు 'డీజే టిల్లు' చిత్రానికి సీక్వెల్ గా 'టిల్లు స్క్వేర్' వస్తోంది. అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ప్రకటన వచ్చినప్పటి నుంచి.. టిల్లుని, అతని చేష్టలను తిరిగి వెండితెరపై చూడటం కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను పెంచాయి. 'టిల్లు స్క్వేర్' నుంచి ఇప్పటికే విడుదలైన 'టికెటే కొనకుండా', 'రాధిక' పాటలు విశేష ఆదరణ పొందాయి. యూట్యూబ్ లో మిలియన్ల కొద్దీ వ్యూస్ తో సంచలనం సృష్టించాయి. తాజాగా ఈ చిత్రం నుంచి 'ఓ మై లిల్లీ' అనే పాట విడుదలైంది. సోమవారం వారం సాయంత్రం హైదరాబాద్ లోని ఏఎంబీ మాల్ లో అభిమానుల కోలాహలం మధ్య జరిగిన వేడుకలో ఈ పాటను విడుదల చేశారు. అచ్చు రాజమణి స్వరపరిచిన 'ఓ మై లిల్లీ' మెలోడీ సాంగ్ కట్టి పడేస్తోంది. గాయకుడు శ్రీరామ్ చంద్ర తన మధుర స్వరంతో మాయ చేశాడు. సిద్ధు, రవి ఆంథోనీ సాహిత్యం అద్భుతంగా కుదిరింది. తేలికైన పదాలతో లోతైన భావాన్ని పలికించారు. ఇక లిరికల్ వీడియోలో సిద్ధు, అనుపమ మధ్య కెమిస్ట్రీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పాట విడుదల సందర్భంగా దర్శకుడు మల్లిక్ రామ్ మాట్లాడుతూ.. "ఓ మై లిల్లీ పాట మీ అందరికీ నచ్చిందని భావిస్తున్నాను. విజయవంతమైన చిత్రానికి సీక్వెల్ కావడంతో ఈ సినిమా మొదలైనప్పుడే ఎంతో బాధ్యత, ఒత్తిడి ఉందని అర్థమైంది. మాకు ఒక మంచి టీం దొరికింది. అందరం కలిసి మంచి అవుట్ పుట్ ని తీసుకొచ్చాము. ఈ చిత్రం మార్చి 29న థియేటర్లలో విడుదల కానుంది. మీ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా అందరినీ అలరిస్తుందని నమ్ముతున్నాను" అన్నారు.

## 26న మగధీర రీరిలీజ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా రామ్ చరణ్ ఫ్యాన్స్ అందరికీ ఒక రోజు ముందే పండగ రాబోతుంది. తెలుగు సినిమా ఇండస్ట్రీ రికార్డులను తిరగరాసి తెలుగు వాడి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన గీతా ఆర్ట్స్ పతాకంపై అల్లు అరవింద్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించి, దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో రూపొందించిన మెగా బ్లాక్ బస్టర్ "మగధీర" చిత్రం మార్చి 26న థియేటర్లలో రీ రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా పంపిణీదారులు శ్రీ విజయలక్ష్మి ట్రేడర్స్ అధినేత యర్రంశెట్టి రామారావు, అరిగెల కిషోర్ బాబు మాట్లాడుతూ ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో అత్యధిక థియేటర్లలో రెండు తెలుగు రాష్ట్రాల్లో రీ రిలీజ్ చేస్తున్నాం. మమ్మల్ని ప్రోత్సహించి మాకు రీ రిలీజ్ చేసే అవకాశం కల్పించిన మెగా ప్రొడ్యూసర్ శ్రీ అల్లు అరవింద్ గారికి కృతజ్ఞతలు. తెలుగు ప్రేక్షకులు మెగా అభిమానులు ఈ చిత్రాన్ని ఆదరించి మరోసారి ఘన విజయాన్ని అందించి రామ్ చరణ్ కు బర్త్ డే గిఫ్ట్ ఇస్తారని కోరుకుంటున్నాం అన్నారు.

## జీ5లో 'హనుమాన్'ను స్ట్రీమింగ్



తెలుగువారికే కాదు అన్ని భాషల వారికి వైవిధ్యమైన కథలను అందించడంలో ముందు ఉంటుంది ఓటీటీ ప్లాట్ ఫామ్ ZEE5. ఇప్పుడు పాన్ ఇండియా రేంజ్‌లో సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ మూవీగా నిలిచిన 'హను-మాన్'ను స్ట్రీమింగ్ చేస్తోంది. వెర్సటైల్ యంగ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో కె.నిరంజన్ రెడ్డి నిర్మాతగా ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా జనవరి 12న విడుదలైన 'హను-మ్యాన్' చిత్రం ఎవరూ ఊహించని సక్సెస్‌ను సొంతం చేసుకుంది. పాన్ ఇండియా లెవల్లో రూ.300 కోట్లను అందుకుంది. థియేటర్స్‌లో 'హను-మ్యాన్' సినిమాను ఎంజాయ్ చేసిన ఆడియెన్స్ ఓటీటీలో ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఆసక్తిగా ఎదురు చూడసాగారు. అందరి వెయిటింగ్‌కు జీ5 ఇప్పుడు తెర దించేసింది. ఈ ఎగ్జయిటింగ్ చిత్రాన్ని ఆడియెన్స్‌కు అందిస్తోంది. ప్రపంచంలోనే తొలి సూపర్ హీరో ఎవరంటే వెంటనే వినిపించే పేరు 'హనుమాన్'. కానీ దైవశక్తిని ఎదిరించేలా తాను ఎదగాలని, ప్రజలందరూ తననే సూపర్ హీరోగా చూడాలని భావించిన ఓ వ్యక్తి (వినయ్ వర్మ).. కృత్రిమంగా శక్తిని సంపాదించుకునే పనుల్లో బిజీగా ఉంటాడు. అదే సమయంలో అంజనాద్రి ప్రాంతంలో ఉండే హనుమంతు (తేజ సజ్జ) అల్లరి చిల్లరగా తిరుగుతుంటాడు. తల్లిదండ్రి లేని హనుమంతుని అక్క అంజనమ్మ (వరలక్ష్మి శరత్ కుమార్) అన్నీ తానై హనుమంతుని పెంచి పెద్దచేస్తుంది. ఆ ప్రాంతంలో అన్యాయం చేస్తోన్న గజపతిని ఓ సందర్భంలో హనుమంతు ఆ ఊళ్లో వైద్యం చేయటానికి వచ్చిన డాక్టర్ మీనాక్షి కారణంగా ఎదుర్కోవాల్సి వస్తుంది. మీనాక్షిని హనుమంతు చిన్నప్పటి నుంచి ఇష్టపడుతుంటాడు. గజపతి కారణంగా హనుమంతు ప్రమాదంలో చిక్కుకుంటే అతని ఆంజనేయ స్వామికి సంబంధించిన ఓ అపూర్వశక్తి దొరుకుతుంది. దాంతో అతను ప్రజలకు మంచి చేస్తుంటాడు. చివరకు విషయం విలన్ వరకు చేరుతుంది. అపూర్వ దైవశక్తిని సంపాదించుకోవటానికి ప్రతినాయకుడు ఏం చేశాడు.. అతన్ని మన హీరో ఎలా ఎదుర్కొన్నాడు.. చివరకు ఆంజనేయస్వామి భక్తుడి కోసం ఏం చేశాడనే కథాంశంతో 'హను-మ్యాన్' తెరకెక్కింది. పాన్ ఇండియా బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ వసూళ్లను రాబట్టి రికార్డులను క్రియేట్ చేసిన 'హను-మ్యాన్'..జీ 5లో సరికొత్త రికార్డులను క్రియేట్ చేయటానికి సిద్ధమైంది.

## 'బచ్చలమల్లి' సరికొత్త కథతో డిఫరెంట్ జోనర్ సినిమా

నిర్మాత రాజేష్ దండా



పంపిణీదారుని కంటే నిర్మాతగా ప్రయాణం బాగుందనీ, నచ్చిన కథతో ప్రయాణం చేసే వెసులుబాటు నిర్మాతగా వుందని సక్సెస్ ఫుల్ నిర్మాత రాజేష్ దండా తెలియజేస్తున్నారు. నేను పంపిణీదారుడిగా వున్నప్పుడే సందీప్ కిషన్, అల్లరి నరేష్ నన్ను నమ్మారు. అలా నాతో జర్నీ చేస్తున్నారు. వారితో మరలాసినిమాలు తీయడానికి కారణమదే అంటూ హాస్య మూవీస్ అధినేత రాజేష్ దండా అన్నారు. హాస్య మూవీస్ పతాకంపై పలు సినిమాలు నిర్మిస్తున్నారు. మార్చి 19 న రాజేష్ దండా పుట్టినరోజు. ఈ సందర్భంగా సినిమా నిర్మాణంలోనూ, భవిష్యత్ సినిమాల గురించి పలు విషయాలను పాత్రికేయుల సమావేశంలో వెల్లడించారు. స్వామిరారా చిత్రంతో పంపిణీదారునిగా మొదలయి దాదాపు 82 సినిమాలను విడుదల చేశా. ఒక్క క్షణం, నాంది సినిమాలకు సహ నిర్మాతగా పనిచేశా. అనిల్ సుంకరతో ప్రయాణం సాగిస్తూ ఊరి పేరు భైరవ కోన, సామజవర గమన వంటి సినిమాలను నిర్మించా. అవి హిట్ కావడంతో ఈ బర్త్ డే గిఫ్ట్ గా మరో కొన్నిసినిమాలు సిద్ధం చేసుకున్నా. నేను ఇంతకుముందు కూడా చేసినవి స్వంత బేనర్ లోనే. నా కిష్టమైన వారితో నా బేనర్ లో చేయడం చాలా హ్యాపీ. నాంది సినిమా నా జోనర్ సినిమా. బచ్చలమల్లి కూడా నా జోనర్ సినిమా. ఇలా నా కిష్టమైన కథలతో మనుషులతో చేయడం చాలా ఆనందంగా వుంటుంది. దీనికి సుబ్బు దర్శకుడు. 90 దశకంలోని కథ. చాలా ఆసక్తికరంగా వుంటుంది. కథ ప్రకారం సహజమైన లొకేషన్లలో తీయాలని అన్నవరం, తుని చుట్టు పక్కల విలేజ్ లలో షూటింగ్ చేస్తున్నాం. మే 10 నుంచి సాగే సింగిల్ షెడ్యూల్ లో సినిమా పూర్తి చేస్తాం. ఇక్కడ ఒక్కటే కొలమానం. సినిమాలు బాగా ఆడుతున్నాయి కనుక బిజినెస్ జరుగుతుంది. ఇంతకంటే పెద్ద నిర్మాతలు చిన్న నిర్మాతలు అనే తేడాలేదు. ఒకరకంగా పంపిణీదారునిగా వున్న అనుభవం చాలా వరకు ఉపయోగపడుతుంది. కాన్సెప్ట్ పరంగా చూసుకుంటే కొత్తగా వుండే పాయింట్ తో వెళ్ళాలన్నదే నా పాలసీ. అలాంటి కథలతోనే భైరవ కోన, ఇట్లు మారేడుమిల్లి ప్రజానీకం, సామజవరగమన వంటి సినిమాలు తీయగలిగాను.

## 29 న తలకోన విడుదల



అక్షర క్రియేషన్ పతాకంపై నగేష్ నారదాసి దర్శకత్వంలో దేవర శ్రీధర్ రెడ్డి ( చేవెళ్ల) నిర్మాతగా అప్సర రాణి ప్రధాన పాత్రలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ "తలకోన" . ఈ చిత్రం అన్ని హంగులు పూర్తి చేసుకుని మార్చి 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సంధ్బంగా చిత్ర నిర్మాత శ్రీదర్ రెడ్డి మాట్లాడుతూ... క్రైమ్ థ్రిల్లర్ తో సాగే ఈ కథాంశం మొత్తం ఫారెస్ట్ బ్యాక్ డ్రాప్ లో ఉండబోతోంది. అయితే ఫారెస్ట్ అనగానే కేవలం ప్రకృతి అందాలే కాదు అందులో ఇంకో కోణం కూడా ఉటుందని, అదే విదంగా పాలిటిక్స్, మీడియాను సైతం మిక్స్ చేసి చూపించడం జరుగుతుంది. అంతే కాకుండా ప్రకృతిలో ఏమేమి జరుగుతాయో తెలిపే ప్రయత్నం కూడా చేసాము. అందుకు తగ్గ టీమ్ ను, టెక్నికల్ టీమ్ కూడా సినిమాకు తీసుకోవడం జరిగింది. అలాగే థ్రిల్లింగ్ సస్పెన్స్ తో మార్చి 29 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అన్నారు . దర్శకుడు నగేష్ నారదాసి మాట్లాడుతూ.. అప్సర రాణీ నటించిన వెరైటీ స్టోరీ ఇది . షూటింగ్ "తలకోనలో అద్భుతంగా జరిగింది. మా సినిమా తప్పక విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను." అన్నారు .



## రాజముండ్రి పరిసరాల్లో "1920 భీమునిపట్నం"



కంచర్ల ఉపేంద్ర అపర్ణాదేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం "1920 భీమునిపట్నం".. అవార్డు చిత్రాల దర్శకుడు నరసింహ నంది దర్శకత్వంలో ఎస్.ఎస్.ఎల్.ఎస్. (SSLS) క్రియేషన్స్ పతాకంపై కంచర్ల అచ్యుతరావు నిర్మిస్తున్న ఈ చిత్రం చిత్రీకరణ రాజముండ్రి పరిసరాల్లో జరుపుకుంటోంది. ఈ మధ్యనే రామోజీ ఫిలింసిటీలో షూటింగ్ ను ప్రాంభించుకుని, అక్కడే పది రోజులపాటు చిత్రీకరణ జరుపుకున్న ఈ చిత్రం యూనిట్ రాజముండ్రికి వెళ్లి, అక్కడి పరిసరాల్లో హీరో,హీరోయిన్ల మధ్య వచ్చే కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత కంచర్ల అచ్యుతరావు మాట్లాడుతూ, "రాజమండ్రిలో కూడా పది రోజుల పాటు షూటింగ్ జరుపుతాం. . హీరో, హీరోయిన్ల పై గోదావరి నేపథ్యంలో సన్నివేశాలను తీయడం జరుగుతోంది. ఈ చిత్రంలోని సీతారాం, సుజాత పాత్రల మధ్య నడిచే ప్రేమకధను దర్శకుడు అద్భుతంగా తెరకెక్కిస్తున్నారు. కథానుసారం సంగీతం, ఫోటోగ్రఫీ చిత్రానికి ప్రాణంగా నిలుస్తాయి. ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా సంగీతాన్ని అందిస్తుండటం ఓ హైలైట్. రాజముండ్రి తర్వాత విశాఖపట్నం, అరకు, ఊటీలలో కూడా చిత్రీకరణ జరుపుతాం" అని చెప్పారు. దర్శకుడు నరసింహ నంది మాట్లాడుతూ, "భారత స్వతంత్ర పోరాట నేపథ్యంలో చక్కటి భావోద్యేగాల మధ్య నడిచే కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. పాత్రలన్నీ సహజసిద్ధంగా ఉంటాయి. నిజ జీవితంలో జరిగిన కొన్ని ఘటనలను ప్రేరణగా తీసుకుని ఈ సినిమా చేస్తున్నాం.

## 50 సెకన్లు .. రూ.5 కోట్లు...

లేడీ సూపర్ స్టార్ రేంజ్ ఈమధ్య కాలంలో చిన్నస్టార్స్ కూడా పెద్ద మొత్తంలో పారితోషికం తీసుకుని ర్షియల్ యాడ్స్ లో నటిస్తున్నారు. ఈమధ్య కాలంలో చిన్నస్టార్స్ కూడా పెద్ద మొత్తంలో పారితోషికం సుకుని కమర్షియల్ యాడ్స్ లో నటిస్తున్నారు. కానీ నయతార మాత్రం కమర్షియల్ యాడ్స్ కి చాలా అరుదుగా ఓకే చెబుతూ ఉంటుంది. ఈ మధ్య కాలంలో కొత్తగా కమర్షియల్ యాడ్స్ కి నో చెబుతూ వచ్చిన నయనతార ఎట్టకేలకు ఒక యాడ్ కి ఓకే చెప్పింది. కోలీవుడ్ వర్గాల నుంచి అందుతున్న మాచారం ప్రకారం తాజాగా నయనతార ఒక కమర్షియల్ యాడ్స్ లో నటించేందుకు ఓకే చెప్పింది. కేవలం 50 సెకన్ల యాడ్ లో కనిపించేందుకు గాను ఏకంగా రూ.5 కోట్ల పారితోషికంను కుంటున్నట్లుగా సమాచారం అందుతోంది. ఏడాది పాటు ఆ కంపెనీకి సంబంధించిన ప్రమోషన్ లో నతార ఫోటోలు మరియు వీడియోల్లో నయనతార కనిపించబోతుంది. యాడ్ చిత్రీకరణ ఇప్పటికే భం అయ్యిందని తెలుస్తోంది. లేడీ సూపర్ స్టార్ గా సౌత్ ఇండియన్ భాషల్లో అన్నింట కూడా మంచి జ్ ను ఈ అమ్మడు సొంతం చేసుకుంది. నయనతార తో యాడ్ చేస్తే అది తమిళం, తెలుగు మరియు యాళ, కన్నడ భాషల్లో కూడా ప్రసారం చేయవచ్చు. అందుకే అయిదు కోట్ల పారితోషికంను ఇచ్చి మరీ నటింపజేసినట్లుగా సమాచారం అందుతోంది. త్వరలోనే తెలుగు లో ఈ అమ్మడు ఒక సినిమా చేయబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి.